## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-08-2003, జగ్గయ్యపేట

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు జన్మాష్టమి. కృష్ణుడు శరీరం ధరించినరోజు కృష్ణాష్టమి. దీనినే జన్మాష్టమి అంటారు. శివుడు లింగరూపం ధరించిన రోజు శివరాత్రి. భగవంతుని అవతారములలో ఈరెండూ చాలా ముఖ్యమైనవి. కృష్ణుడి యొక్క లీలలు, ఆయనచేసిన అద్భుతాలు, మహిమలు అన్నీ భాగవతంలో కనిపిస్తాయి. కురుక్షేత్రయుద్ధం ప్రారంభించేముందు కృష్ణుడు అర్జునుడికి భగవద్గీతను ఉపదేశించాడు. యుద్ధప్రారంభ సమయంలో అర్జునుడికి మోహంరావటం, ఆమోహంనుండి విడుదల చేయటం కోసం అర్జునుడిని నిమిత్తమాత్రంగా పెట్టుకొని జీవకోటినంతా ఉద్ధరించటం కోసం, వారు మోక్షానుభవం పొందటంకోసం అనేక ఉపాయాలను మనకు గీతలో ప్రవచనము చేసారు కృష్ణస్వామి. ప్రపంచంలో ఉన్న అన్ని మత గ్రంధముల సారము భగవద్గీత. భగవద్గీత ఉపదేశ గ్రంధము, దేవుడు జీవుడికి ఉపదేశంచేసాడు. మనం దానిని అధ్యయనంచేసి, అర్థం చేసుకొని, ఆచరిస్తే మనకు మోక్షం కలుగుతుంది. భగవంతుడిని పొందటానికి అనేక ఉపాయాలు గీతలో చెప్పాడు. భక్తియోగం, కర్మయోగం, ధ్యానయోగం ఇవన్నీ చెప్పాడు. భక్తిద్వారా భగవంతుడిని ఎలా పొందాలి అనేది భక్తియోగంలో వివరించాడు. కర్తలేనికర్మను చేస్తూ భగవంతుడిని పొందే ఉపాయము కర్మయోగం. ఏది నిత్యం ఏది అనిత్యం, ఏది సత్యం ఏది అసత్యం అని విచక్షణ చేసుకొంటూ మనం కానిదానిని విడిచిపెడుతూ, మనం ఏదిగాఉన్నామో దానిని అవగాహన చేసుకొంటూ దానిలో ఐక్యం చేసేదే జ్ఞానయోగం. ప్రాణాయామము అవి ధ్యానయోగంలోనికి వస్తాయి. భగవంతుడిని చేరుకోవటానికి అనేక మార్గాలు చెప్పాడు. ఏదోమార్గంద్వారా సిన్సియర్‌గా ప్రయాణంచేస్తూ ఉంటే భగవంతుడిని చేరుకోవచ్చు. ఇందులో ఒకమార్గం ఎక్కువ, ఒకమార్గం తక్కువ అని అనుకోవద్దు. శిఖరానికి చేరుకోవటానికి అనేకమార్గాలు ఉంటాయి. ఒక మార్గంలో శిఖరానికి వెళ్ళేవాడు నా మార్గం మంచిదని వాడు అనుకోచ్చు. ఏమార్గంలో ప్రయాణం చేసినా ప్రయాణం చేసేవారు అందరూ నాదగ్గరకే వస్తున్నారు అని శిఖరం మీద కూర్చొన్న వాడికి తెలుస్తుంది. అందుచేత ప్రయత్నం చేస్తూఉంటే మనం ఏమార్గంలో వెళ్ళినా శిఖరాన్ని చేరుకొంటాము. మోక్షంపొందటానికి అనేక ప్రక్రియలు భగవంతుడు చెప్పాడు. మోక్షం పొందిన వాడికి ఇంక శరీరంరాదు ఎందుచేతనంటే వాడికి శరీరంతో పనిలేదు. సత్యం, అహింస, ప్రేమ,





సహనము, స్వార్థాన్ని తగ్గించుకోవటం, మమకారాన్ని తగ్గించుకోవటం ఇలా ఎన్నో కళ్యాణగుణాల గురించి భగవంతుడు వివరించాడు. గుణం అనేది మనస్సుకు సంబంధించినదే, చైతన్యానికి సంబంధించినది కాదు. కాని ఈ కళ్యాణగుణాలు అన్నీ ఆత్మానుభవం పొందటానికి సహకరిస్తాయి కాబట్టి వాటిని అలవర్చుకోమని భగవంతుడు చెప్పాడు. ఈలోకంలో ఎంతమంది మహర్షులు ఉన్నా, ఎంతమంది మహాత్ములు ఉన్నా వారికి ఆశరీరంతో పనిలేదు, ఈ జీవకోటి మోక్షం వైపుకు ప్రయాణం చేయటానికి సహాయసహకారములు అందించటానికే వారు ఈ లోకంలో ఉన్నారు అంతేగాని వారికి ఇంకోపని అంటూ ఏమీలేదు. వారు ఏస్థితిని అయితే పొందారో ఆస్థితికి మనంకూడా చేరుకోవటానికి తదనుగుణంగా మనచేత సాధనచేయించటానికి వారిదేహాలను ఈశ్వరుడు ఉపయోగించుకొంటాడు. మీ శరీరం లోకంలో తిరుగుతూ ఉంటుంది. శరీరం లోకంలో తిరుగుతూఉన్నా మీ మనస్సును నాయందే ఉంచండి. నిరంతరం నన్ను స్మరించండి, నా రూపాన్ని ధ్యానించండి, నాకిష్టమైన పనులు చేయండి, మీ మనస్సును సంతృప్తి పరచుకోవటంకోసం మీరు జీవించవద్దు, నాకోసం మీరు జీవించండి, అప్పుడు మీరు నాదయకు పాత్రులవుతారు, మోక్షాన్ని పొందుతారు అని భగవంతుడు చెపుతున్నాడు. దేహప్రారబ్దాన్ని బట్టి ఆదేహంద్వారా పనిజరుగుతూ ఉంటుంది. అందుచేత మీరు చేసేపనిని అయిష్టంగా చెయ్యవద్దు, ఇష్టంగాచెయ్యండి, ప్రేమగా చెయ్యండి, రియాక్షన్‌లేకుండా చెయ్యండి, అప్పుడు మీరు అహంభావరహితస్థితిని పొందుతారు. మన ఇష్టాయిష్టాలను ప్రక్కనపెట్టి భగవంతుడు ఇది చెప్పాడు కాబట్టి చేద్దామని, ఆయనకోసం జీవిస్తూ ఉంటే మనకు ఆత్మానుభవం కలుగుతుంది. కోరిక, కోపం, ఆశ ఇవిఅన్నీ నరకద్వారాలు అని భగవంతుడు చెప్పాడు. మనకు అవసరంలేనివి కూడా కోరుకొంటాము మనకు ఏదైనా అవసరం అనుకోండి ఇతరులను అడుగవచ్చు కాని మనకు అవసరంలేనిది ఇతరులు ఇచ్చినా అది మనంపుచ్చుకోకూడదు. కోరిక ఉన్నవాడికి భయం, కోరిక లేకపోతే భయంలేదు. కోరిక ఉన్నవాడికి కోపం, కోరికలేనివాడికి కోపంలేదు. కోరిక ఉన్నవాడికి దుఃఖం, కోరికలేనివాడికి దుఃఖంలేదు. ఈకోరికలే మనకు బంధం. ఈ చిల్లరవిషయాలకు మనం కాలాన్ని పాడుచేసుకొంటున్నాము. మనం కాలాన్ని సద్వినియోగం చేసుకొంటే ఆధ్యాత్మికసంపదపెరుగుతుంది.

ఆత్మఒక్కటే నిత్యమైనది, ఆత్మఒక్కటే సత్యమైనది, ఆత్మఒక్కటే శాశ్వతమైనది. అందులోనే సుఖంఉంది, శాంతిఉంది, ఆనందం ఉంది. మిగతావిషయాలలో నీకు

ఆనందం ఉన్నట్లుగా కనిపిస్తున్నప్పటికీ పరిణామంలో అవి దుఃఖాన్ని తీసుకొనివస్తాయి. అందరిహృదయాలలో నేను ఆత్మగా ఉన్నాను. కొంచం లోచూపు నేర్చుకో, లోపలకు వెళ్ళటానికి ప్రయత్నం చెయ్యి, నీశరీరాన్ని అదుపులో పెట్టుకో, నీ మనస్సును, ఇంద్రియాలను నిగ్రహించుకో, భగవంతుడు నీకుఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొంటూ అంతర్యామిగా ఉన్న నన్ను పొందటానికి ప్రయత్నంచేసుకో, అదే నీజీవితగమ్యం అని భగవంతుడు చెపుతున్నాడు. ఇది గీతయొక్క సారం. భగవద్గీతను అప్పుడప్పుడు చదవమంటారా అని రమణమహర్షిగారిని అడిగితే అప్పుడప్పుడూ చదవటంకాదు, ఎప్పుడూ చదువు అనిచెప్పారు. జ్ఞానగంగ మనహృదయంలో ఉంది, అక్కడ మనం స్నానంచెయ్యాలి, మన మనస్సును తీసుకొనివెళ్లి అక్కడ స్థిరంగా ఉంచితే అదినశిస్తుంది, భగవంతుడు నీకు స్వరూపంగావ్యక్తమవుతాడు. మనోనిగ్రహం లేనివాడు, ఇంద్రియనిగ్రహంలేనివాడు ఆత్మజ్ఞానానికి అర్హుడుకాదు. అందుచేత నీవు భగవంతుడిని ధ్యానించి, ఆయన లీలలను ఎంజాయ్‌చేస్తూ మనోనిగ్రహాన్ని, ఇంద్రియనిగ్రహాన్ని సంపాదించు. బాహ్యంగా విజృంభిస్తున్న నీమనస్సును నిరోధించటానికే యోగం. మనస్సుపూర్తిగా నశించాలి, మనోనాశనం అవ్వకుండా మనోమూలంలో ఉన్న వస్తువు నీకు గోచరంకాదు. నీకు దేహాభిమానం ఉన్నంతకాలం జన్మలు వస్తూనే ఉంటాయి, నీవు మరణాన్ని అతిక్రమించలేవు. దేహాభిమానం ఉన్నవాడు, వాడు ఎంతటివాడైనా పండితుడైనా, ధనవంతుడు అయినా, అధికారి అయినా ఆత్మజ్ఞాని ముందు స్వల్పంగా, అల్పంగా కనిపిస్తాడు, జ్ఞానం యొక్కవైభవం అట్టిది. హృదయంలో ఉన్న వస్తువు నీకు గోచరమయ్యేవరకు నీవు జననమరణ చక్రంలో తిరుగుతూ ఉంటావు, అందులోనుండి తప్పించుకొనే అవకాశంలేదు. దేహాత్మబుద్ధి ఉన్నవాడు దేహం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు. అంటే మరణంచేతిలో ఓడిపోతున్నాడు. తనుఎవరు? ఆత్మ, ఆత్మకు చావులేదు. మరిచనిపోతున్నాను అని ఎందుకుఅనుకొంటున్నాడు? వాడుకాని దేహంతో తాదాప్యం పొందటం వలన అలా అనుకొంటున్నాడు, మరణం చేతిలో ఓడిపోతున్నాడు, సంసారచక్రంలో తిరుగుతున్నాడు. ఎవరో దేవతాపురుషుడి కరుణ, గురువు అనుగ్రహం మనమీద వర్షించాలి. అప్పటివరకు మనం ఒడ్డుకు వచ్చేఅవకాశం లేదు. అహంభావనను తొలగించుకోవటం మీరు అనుకొన్నంత తేలికకాదు. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని ప్రయత్నంచేయాలి, సత్పురుషుల సహవాసం ఉండాలి, ఈశ్వరుడి కరుణ రావాలి ఇవి అన్నీ కలిసివస్తేనే గాని అహంభావరహితస్థితిని మనం పొందలేము. ఎప్పుడయితే నీవు ఒకపేరుతోటి, ఒక





రూపంతోటి తాదాప్యం పొందుతున్నావో అప్పుడు వికారాలు వస్తాయి. దేహం నేను అనే తలంపు నీకు బయటనుండి రావటం లేదు, లోపల నుండే వస్తోంది. భగవంతుడు ఏ హృదయంలో అయితే అంతర్యామిగా ఉన్నాడో అక్కడనుండే నేను అనే తలంపు వస్తోంది. ఆమూలతలంపును పట్టుకొని, దాని మూలంలోనికి ఉపసంహరిస్తూ ఉంటే దానికి వచ్చే ఇతర తలంపులు అన్నీ ఆగిపోతాయి. మూలతలంపు దాని మూలాన్ని చూసినవెంటనే అది నశిస్తుంది, అక్కడ ఉన్న నారాయణుడే నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మనస్సును నియమించుకోవటానికి నీవు ప్రయత్నం చేస్తున్నావు అనుకో ఒకోసారి నీమనస్సు బయటకు పోతూఉంటుంది. అదిబయటకు వెళితే వెళ్ళింది గాని నీ శరీరాన్ని ఇక్కడే ఉంచు. నీ మనస్సులో సినిమాకు వెళ్ళాలి అనే తలంపువచ్చింది అనుకో, వెళితే వెళ్ళనియ్యి అదే వెనుకకు వచ్చేస్తుంది. అంతేగాని నీ శరీరాన్ని తీసుకొని వెళ్ళి సినిమాహాలులో పడేయకు. ఆహారం విషయంలో అతిగా ఉండవద్దు, మాటలవిషయంలో అతిగా ఉండవద్దు, వ్యవహారం విషయంలో అతిగా ఉండవద్దు. సాధకుడికి మధ్యేమార్గం మంచిది. ఆహారం విషయంలో, మాటలు విషయంలో, వ్యవహారం విషయంలో యుక్తంగా ఉండు, సమానంగా ఉండు అప్పడు నీకు



సమానబుద్ధి కలుగుతుంది. లోపలఉన్న వస్తువు హెచ్చుతగ్గులతో లేదు, సమానంగా ఉంది, సింపుల్‌గా ఉంది. నీ మనస్సు కూడా సమానంగా ఉంటే, సింపుల్‌గా ఉంటే నది వెళ్ళి సముద్రంలో కలిసినట్టుగా ఈ సమానమైన మనస్సు వెళ్ళి ఆత్మలో ఐక్యమవుతుంది. మీరు చెడుకు దూరంగా ఉండండి, మంచిచేయండి. మంచి చేయటం వలన మీకు సంతోషంవస్తుంది, సంతృప్తివస్తుంది, ఉత్తమజన్మలు వస్తాయి, మంచిచేసిన వాడికి మనస్సు అణుగుతుంది. మంచిచేసిన వాడికి దుర్గతిలేదు అని భగవంతుడు గీతలో చెప్పాడు. నీవు చేస్తున్న కర్మ ఎంతోకొంత లోకానికి ఉపయోగపడాలి, నీకు మోక్షం పొందటానికి సహకరించాలి. అందుచేత పనిచెయ్యి, ఎలా చెయ్యాలో తెలుసుకొని చెయ్యి, వివేకంతో చెయ్యి, ప్రేమతో చెయ్యి. భార్య భర్తను ఎంతగా ప్రేమిస్తుందో, భర్తభార్యను ఎంతగా ప్రేమిస్తాడో అంతప్రేమగా ఈ సృష్టిని మనం ప్రేమిస్తున్నాము అనుకోండి జ్ఞానమే మన దగ్గరకు వస్తుంది,

అది ప్రేమయొక్క వైభవం. నీకు సత్వగుణం లేదుఅనుకో, నువ్వు చెప్పిన మాట మనస్సు వినటం లేదు అనుకో, అప్పుడు ప్రశాంతంగా ఉండు, సాధన చెయ్యవద్దు. మనస్సులోసత్వగుణం ఉన్నప్పుడు నీ సాధన యొక్క డ్యూరేషన్ పెంచుకో నీవు ఓర్పుతో కృషిచెయ్యి, నేర్పుతో కృషిచెయ్యి. ఓర్పు ఎంత అవసరమో నేర్పుకూడా అంతే అవసరం. మనలో ఉన్నదురదృష్టం ఏమిటి అంటే మనకు సహనం లేకపోయినా సహనం ఉంది అనుకొంటున్నాము. సహనం లేకుండా హృదయం యొక్కలోతులలోనికి వెళ్ళలేము. అందుచేత నీవు మనస్సును నియమించుకొని, సత్వగుణాన్ని పెంచుకొని హృదయం యొక్క లోయలలోనికి వెళ్ళటానికి కృషిచెయ్యాలి. కృషి ఉన్న చోట కృప ఉంటుంది. నాకు ప్రాణాయామం ఇష్టం అని ఒకరు భగవాన్‌తో అంటే చేసుకోవయ్యా, నీమనస్సును లోపలకు పంపటానికి ప్రాణాయామం సహకరిస్తే ఆరకంగానే నీవు ప్రయాణం చెయ్యి అని భగవాన్ చెప్పారు.

మన శరీరం చనిపోయేటప్పుడు మనస్సు అక్కరలేని గొడవలు, ప్రకృతి విషయాలు అన్నీ నొల్లుకొంటుంది, దానికి ఆత్మచింతన ఉండదు ఈలోపు ప్రాణం శరీరాన్ని విడిచిపెట్టిపోతుంది, ఇంక మనకు చీకటి లోకాలు మిగులుతాయి, పనికిరాని జన్మలువస్తాయి. ఏదైతే సత్యమైనదో, ఏదైతే నిత్యమైనదో, ఏదైతే జ్ఞానవంతమైనదో ఆవస్తువు నీ హృదయంలోనే ఉంది, దానిని అనుభవైక వేద్యం చేసుకో, అదే నీజీవితగమ్యం. దానిని పొందటం మీదే నీ దృష్టినంతా కేంద్రీకరించి పనిచెయ్యి. నీ పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి నీకు ఏ పద్ధతి తేలికగా ఉందో, యిష్టంగా ఉందో ఆరకంగా సాధనచేసుకో, ఇందులో బలవంతం లేదు, ఎక్కువ తక్కువ అని ఏమి లేదు. నీవు జపంచేస్తూఉంటే ఇతరతలంపులు రాకుండా అదిఆపు చేస్తుంది. నీకు వ్యర్థమైన చింతలు, వ్యర్థమైన తలంపులు వస్తూఉంటే జపసాధన చేసుకో. కొంతమందికి ఎటువంటి తలంపులు వస్తాయి అంటే అవి వారికి ఉపయోగపడవు, సమాజానికి ఉపయోగపడవు, దానివలన మన ప్రాణశక్తి వృధా అవుతుంది. ప్రాణశక్తిని మనం భగవంతుడిని తెలుసుకోవటానికి ఉపయోగించాలి కాని అనవసరమైన విషయాలకు ప్రాణశక్తిని ఖర్చుపెట్టకూడదు. గురువు అంటే ఆత్మ, గురువు అంటే చైతన్యం. దేవతలందరూ చేసే పని గురువే చేసేస్తాడు. బ్రహ్మచేసేపని, విష్ణువుచేసేపని, శివుడు చేసేపని గురువే చేసేస్తాడు. ఒకవేళ ఎప్పుడైనా భగవంతుడికి కోపం వస్తే మనకు అపాయం రాకుండా ఆకోపాన్ని గురువే మింగేస్తాడు, అంటే మనకు ప్రొటెక్షన్ యిస్తాడు. అనేక జన్మలనుండి నీవు భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా, ధ్యానించగా ధ్యానించగా,





మోక్షానుభవం పొందాలి అనే ధృడసంకల్పంతో నీవు ప్రయత్నం చేస్తూఉంటే భగవంతుడే ఒకరూపం దాల్చి గురువుగా వచ్చి నిన్ను గైడ్ చేస్తాడు. గురువు మాట్లాడేటప్పుడు పని ఉండి మాట్లాడటం కాదు, కేవలం దయవలన మాట్లాడతాడు. గురువు నోటి నుండి వచ్చేమాటే దయ, ఆమాటే జ్ఞానం, ఆమాటలోనే ప్రేమ ఉంది అది గ్రహించినవాడు ధన్యుడు. అందరిహృదయాలలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడే, ఆచైతన్యమే భక్తుడిపట్ల జాలితో, భక్తుడిని పరిపక్వానికి తీసుకొని రావటం కోసం ఒకమానవరూపం ధరించివస్తాడు, వాడు గురువు. మనలో అంతర్యామిగా ఉన్న ఆత్మే, చైతన్యమే నిజమైనగురువు. బయటి గురువు మనకు బోధిస్తాడు, మనలను లోపలకు నెట్టటానికి ప్రయత్నం చేస్తాడు. లోపలగురువు మనలను లోపలకు గుంజుకొని, జీవలక్షణాలను తొలగించి మనలను శుభ్రంచేసి, పక్వంచేసి తనస్వరూపాన్ని మనకు ఇస్తాడు. అదే ఆత్మస్వరూపం, అదే జ్ఞానస్వరూపం, అదే శాంతిస్వరూపం, అదే సుఖస్వరూపం, ఆసుఖంనీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు దేవుడు వచ్చి ఎదురుగా నిలబడిన నీకుచూడాలని అనిపించదు, అది గౌరవం లేకపోవటం కాదు, ఆత్మానందంలో జీవుడు ఊగిసలాడుతూ ఉంటాడు, వాడికి ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే, వాడికి శరీరంతో పనిలేదు. గురువునీతో సరదాగా మాట్లాడుతూ ఉంటాడు, ఏమిటి బాగున్నావా అంటాడు, పంటలు బాగున్నాయా అంటాడు. ఇవన్నీ కూడా నిన్ను లోపలకు తీసుకొని పోవటానికే చేస్తాడు. మధ్యమధ్యలో ఆత్మగురించి బోధిస్తాడు, మీయోగక్షేమములు అడుగుతూ ఉంటాడు అలా మీతో మాట్లాడుతూ హృదయం యొక్క లోయలలోనికి నెట్టుకొనిపోతూఉంటాడు. సర్జరీ చేస్తున్నట్లు మీకు తెలియనివ్వడు, మీ బట్ట నలగనివ్వడు, మీ మొఖానికి రాసుకొన్న పౌడరు కూడా చెరగనివ్వడు, లోపల సర్జరీ చేసేస్తూ ఉంటాడు, మీకు ఏమీ ఇబ్బంది లేకుండా, పెద్ద బాధలేకుండా ఆసర్జరీ ప్రక్రియను పూర్తిచేసి మీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు, వాడు గురువు. నిన్ను హృదయంలోనికి నెట్టుతూ ఉన్నప్పుడు నీబలహీనతలు, నీ అలవాట్లు అడ్డువస్తూ ఉంటాయి. జన్మాంతరము నుండి వచ్చే వాసనలనే బండరాళ్ళను నీవు గెంటలేవు. నీచేత ఏదో చిన్న ప్రయత్నం చేయించి ఆరాళ్ళను ఆయనే గెంటేస్తాడు. సాధనచేసి వాటిని గెంటేసాను అని నీవు అనుకొంటావు కాని నీకు తెలియకుండా వాటిని ఆయనే గెంటేస్తాడు ఆరాళ్ళను ఆయనే గెంటుతున్నప్పటికీ నువ్వేగెంటుతున్నట్లుగా నీకు అనిపింపజేసి, నిన్ను అనుగ్రహించి, నీకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు, వాడు గురువు. గురువు వలన నాకు ఈ సహాయం వస్తోందని నీవు అనుకోవాలి అని ఆయన అనుకోడు, వాడు గురువు. మనం ఎక్కడ ఏమనిషిలో ఏమంచి

ఉంటే అది నేర్చుకోవాలి. మనం భౌతికంగా అభివృద్ధి పొందాలంటే ఎంతో ప్లానింగ్ ఉండాలి. భౌతికసంపదకే అంతప్లానింగ్ అవసరమయినప్పుడు మరి ఆధ్యాత్మికసంపదకు ఎంత ప్లానింగ్ ఉండాలి, ఎంత మెలకువగా ఉండాలి, ఎంత వివేకంగా ఉండాలి, ఎంత బుద్ధిసూక్ష్మత ఉండాలి. నీ బుద్ధిలో వంకరలు ఉంటే ప్రకృతిమనుషులు ఏమి చేస్తారు అంటే నీ బుద్ధిలో వంకరలు ఉన్నాయని చెపుతారు కాని వాటిని తొలగించటానికి చూడరు. కాని గురువు అలాకాదు నీబుద్ధిలో వంకరలు ఉన్నాయని నీకు చెప్పడు, వాటిని తొలగించటానికి చూస్తాడు, వాడు గురువు. గురువుఅంటే ఆయన వరల్డ్లీమేన్‌కాదు, ఆయన డివైన్ మేన్. నీకు భయం వేస్తోంది అనుకో, ఆ భయాన్ని నెమ్మదిగా తొలగించి ఆత్మవిశ్వాసంకలుగజేస్తాడు. ప్రపంచం అంతా నీకు వ్యతిరేఖంగా ఉన్నప్పటికి నీవు ఒంటరిగా నీకాళ్ళమీద నీవు నిలబడేటట్లు చేస్తాడు. భయంలోనుండి భయరహితస్థితికి తీసుకొని పోయేటప్పుడు ఆప్రక్రియ నీకు తెలియనివ్వడు, ఏమిటి ఇంత ధైర్యం వచ్చేసింది అనుకొంటావు. అంతకు ముందు పిల్లినిచూస్తే పారిపోతావు, ఇప్పుడు పులితోకూడా పోరాడటానికి సిద్దమవుతావు. గురువు యొక్క అనుగ్రహం అట్టిది. బాహ్యమైన చీకటిని సూర్యుడు ఎలా పోగొడుతున్నాడో అలాగ లోపలఉన్న చీకటిని గురువు పోగొడతాడు. మనలో అంతర్యామిగా ఉండి హృదయగుహలోనికి ప్రవేశించటానికి మనకు ఏవైతే ఆటంకాలు ఉన్నాయో వాటిని క్లియర్ చేస్తూ ఉంటాడు. బోయవాడు జంతువును ఎలా వెంటాడి వేటాడుతాడో అలాగ నీవు హృదయగుహలోనికి చేరేవరకు, నీకు అమృతానుభవం కలిగే వరకు జన్మజన్మలకు గురువునిన్నువెంటాడతాడు. నీవు ఇంకొక జన్మలో మరోశరీరం ధరించవచ్చు, కాని నీవు ఎక్కడ జన్మించావో గురువు చూసుకొంటూ ఉంటాడు, నువ్వు ఆయనను మరిచిపోయినా గురువునిన్ను మర్చిపోడు. గురువు ఎక్కడ ఉన్నాడో నీకు తెలియదు, కానినీవు ఎక్కడ ఉన్నావో గురువు చూసుకొంటూ ఉంటాడు. గురువు రూపరహితుడు, నామరహితుడు. గురువుకు దేహంఉన్నా దేహరహితుడు అందుచేత దేహం పోయినా గురువుతో సంబంధం తెగదు. నీకు ఏది మంచిదో అది నీచేత చేయించుకొంటూ పోతాడు. అలాగచెయ్యి, ఇలాగ చెయ్యి అని ఏమిచెప్పడు డైరెక్షన్ చూసుకో అని చెప్పడు. ఆయనే డైరెక్షన్ చూసుకొంటూ నీ చేయి పట్టుకొని హృదయగుహలోనికి తీసుకొని పోతాడు, వాడు గురువు. మనకు దాహం వేస్తే ఎవరైనా మంచి నీళ్లు ఇస్తే వారిపట్ల ఎంతో కృతజ్ఞత చూపిస్తాము, మనకి ఆకలివేస్తూ ఉంటే ఎవరైనా పిలిచి అన్నంపెడితే వారిపట్ల కృతజ్ఞత చూపిస్తాము, మనకు ఎవరైనా చిన్న ఉద్యోగం ఇప్పిస్తే జీవితం పొడుగునా వారిపట్ల కృతజ్ఞత కలిగి ఉంటాము. ఈ కొద్దిపాటి మంచినీళ్ళకు, ఈ





కొద్దిపాటి అన్నానికి, ఏదోచిన్న ఉద్యోగం ఇచ్చినందుకు మనం ఇంత కృతజ్ఞత చూపిస్తున్నాము కదా మరి నీవు హృదయంలో ప్రవేశించటానికి అడ్డుగా ఉన్న బండరాళ్ళను పెకిలించి బయటకు లాగి నీలోపలఉన్న అంధకారాన్ని ఆయనదయతో బయటకు నెట్టి నిన్ను అజ్ఞానంతోనుండి, బంధంలోనుండి విడుదలచేసేవాడికి ఎంత కృతజ్ఞత చూపించాలి. నీవు వాడిని పూజించకపోతే ఎవడిని పూజిస్తావు, నీవు వాడిని ధ్యానించకపోతే ఎవడిని ధ్యానిస్తావు, మీరే చెప్పండి, గురువు నీవ్యాపకాలను పెంచడు, నీవ్యాపకాలలో నుండి, ఆందోళనలో నుండి నిన్ను విడుదలచేస్తాడు. మనం ఒకోసారి మాటలతో వర్ణించలేని, మనస్సుతో ఊహించలేని శాంతిసాగరంలో, ఆనందసాగరంలో ఊగిసలాడుతూ ఉంటాము. ఇది మనం చేసే సాధన వలన వచ్చేసింది అని మనకు అనిపిస్తూ ఉంటుంది. కాని ఇది గురువు దయవలన మనకు వచ్చింది అని గ్రహించినవాడు ధన్యుడు. మనకు ఆనందం అందుతూ ఉంటే ఏదోకష్టపడి సాధనచేసాము, మన ఇంటికి మనం చేరుకొంటున్నాము, అందుచేతనే ఇంత ఆనందంలో ఉన్నాము అనుకొంటాము కాని మన ఇంటికి మనలను తీసుకొనివచ్చిపడేసింది గురువే అన్న సంగతి మనం మర్చిపోతాము. ఇలా మనం మర్చిపోయినప్పటికీ మన దగ్గర నుండి కృతజ్ఞత ఏమీ ఆయన ఆశించడు, వాడు గురువు. గురువు నీలో అంతర్యామిగా ఉన్నాడు కాబట్టి నీకు ఏవైతే ఆటంకాలుగా ఉన్నాయో నీకంటే ఆయనకే బాగా తెలుసు. ఆ ఆటంకాలు అన్నింటిని నాచురల్‌గా, నార్మల్‌గా తొలగించి నీఇంటికి నిన్ను తీసుకొని పోతాడు. మోక్షమే నిజమైన ఇల్లు, ఆఇంటికి తీసుకొని వెళ్ళేవరకు నిన్ను విడిచిపెట్టడు. దారిలో నీకు అనేక ఇబ్బందులు రావచ్చు. ఆ ఇబ్బందుల వలన వచ్చే బాధలు కూడా నీకు తెలియకుండా నీ చెయ్యి పట్టుకొని నీ ఇంటికి నిన్ను తీసుకొని పోతాడు. నీకు ఉన్న సమస్యలను, బాధలను, వ్యాపకాలను పెంచేవాడు గురువుకాదు. నీకు ఉన్న సమస్యలను తగ్గించి, వ్యాపకాలను తగ్గించి, మానసిక రోగాలను తగ్గించి, ఏవిపోతే నీకు లోపలఉన్న వస్తువు స్వరూపంగా వ్యక్తమవుతుందో వాటిని ఆయనే తొలగించి, సాధకుడికి, భక్తుడికి ఏది ఉపకారమో, ఏరకంగా పనిచేస్తే అతనికి మేలు జరుగుతుందో ఆరకంగా రెస్ట్‌లెస్‌గా పనిచేసుకొంటూ పోతాడు వాడే నిజమైన గురువు. శరీరానికి రెస్టుకావాలి. మనస్సుకు రెస్టుకావాలి. గురువు అంటే చైతన్యం, చైతన్యానికి రెస్టుఏమిటి? నీవు గురువు గురించి ఎలా అనుకొన్నా కూడా ఆయన చేసే పని ఆయన చేసుకొంటూ పోతాడు. మనం అజ్ఞానం అనే నిద్రలో ఉన్నాము. అజ్ఞానంఅనే నిద్రలోనుండి మనలను మేల్కొలపటానికి ఎప్పుడు, ఎక్కడ, ఏమి చేయాలి అది ఎలా చేయాలి అని ఆయన చూసుకొంటూ ఉంటాడు,

వాడు గురువు. ఆనందసముద్రం నీ హృదయంలో ఉంది, నీవు అందులో మునకలు వేయటానికి ఏ బలహీనతలు అయితే, ఏ వాసనలు అయితే నీకు అడ్డువస్తున్నాయో వాటిని గురువు చూస్తూ ఉంటాడు, ఇన్ని బలహీనతలు ఉన్నాయా అని అనుకొని వూరుకోడు, వాటిని తొలగించి నీలోపలఉన్న ఆనందసముద్రంలో నీవు ఈదులాడటానికి సహాయ సహకారములు అందిస్తాడు వాడు గురువు. నిన్ను చీకటిలోనుండి వెలుతురులోనికి, అజ్ఞానంలోనుండి జ్ఞానంలోనికి, మృత్యువులోనుండి అమృతత్వంలోనికి తీసుకొని వచ్చేవాడే గురువు. నన్ను ఎవరిని గురువుగా పెట్టుకోమంటారు అని అడుగుతున్నారు. ఎవరి సమక్షంలో నీ ఇంద్రియాలు, మనస్స అణిగిపోతాయెూ, ఎవరి సన్నిధిలో నీవు శాంతితరంగాలలో, కాంతి తరంగాలలో ఈదులాడుతూ ఉంటావో, ఎవరి ప్రెజెన్స్‌లో నీకు తెలియకుండానే నీ మనస్సుకు లోచూపుకలుగుతుందో వాడే నీ గురువు. ధ్యానంచేసేటప్పడు కూడా నీ గురువు ఎవరో నీకు లోపలనుండి తెలుస్తుంది. జీవుడు చేత కాలాన్ని జయింపచేసేవాడు, కామాన్ని జయింపచేసేవాడు గురువు. ఆయన అనుగ్రహం లేకుండా మనం ఆయనను పొందలేము, పొందటం సాధ్యంకాదు. గురువు అంటే నీలోపల ఉన్న ఆత్మే, నీలోపలఉన్న మహావెలుగే గురువు. నీలో ఎంతోకొంత భక్తి ఉంటే ఆపిందిని పండు చేయటానికి, నీలో ఉన్న వ్యక్తిభావనను తగ్గించటానికి, అహంభావరహితస్థితిని నీచేత పొందింపచేయటానికి ఈకాలం, ఆకాలం అనకుండా గురువు ఎప్పడూ నీకు సహాయసహకారములు అందిస్తాడు. నీకు అర్హత ఉంటే, యోగ్యత ఉంటే కేవలం నీ ఒక్కడి కోసం ఈశ్వరుడు గురురూపంలో వస్తాడు. గురువుకు శరీరంతో పనిలేదు. నీకు రూపదృష్టి ఉంది కాబట్టి నీ కళ్లకు కనిపించటం కోసం ఒక రూపాన్ని ధరిస్తాడు గురువువేరు, ఈశ్వరుడు వేరు అని అనుకోవద్దు. ఈశ్వరుడే గురువు రూపం ధరించి నీ ముందుకు వస్తాడు. నీకు బోధించి, ఆయనలో ఐక్యం చేసుకోవటానికే రూపం ధరించివస్తాడు. కొంతమందికి ఎంతసేపు ఏమి తింటున్నాము, ఏమి కట్టుకొంటున్నాము, ఎన్ని సినిమాలు చూస్తున్నాము ఇదే గొడవ తప్పించి వేరేగొడవ ఏమీ ఉండదు. ఏదో దేహంవచ్చిందండీ తిన్నంత తిండి తినేసి, సినిమాలు చూస్తూ ఏదో అలా ఎంజాయ్‌చేస్తూ చనిపోతే వదిలిపోతుంది అనుకొంటారు, అంటే వారికి దేహము ఒక్కటే నిజం. దేహమే సర్వస్వం, దేహంగొడవ తప్పించి వారికి ఏమీ ఉండదు. వారికి దేహమే సత్యంక్రింద కనిపిస్తుంది, జడమే చైతన్యంక్రింద కనిపిస్తుంది. ఈదేహాన్ని ఎంతవరకు సుఖపెట్టగలము అనే గొడవ తప్ప మిగిలినది ఏమీ వారికి ఉండదు. దేహము పోతే మనం పోతాము అని అనుకొంటాడు.

**20-09-2003**



వాడికి చైతన్యం కనబడదు, ఎటుచూసినా జడమే కనబడుతుంది. భక్తుడికి ఎటుచూసినా భగవంతుడే, దేహబుద్ది ఉన్నవాడికి ఎటుచూసినా జడమే. స్మశానంతో దేహయాత్ర ముగుస్తుంది కాని జీవుడి యాత్రముగియదు. అయితే జీవుడికి ముగింపులేదా అంటే ముగింపు ఉంది. జ్ఞానోదయం అయిన తరువాత జీవుడికి ముగింపుఉంది. గురువు అనుగ్రహం లేకుండా జ్ఞానోదయం కలుగదు. రాకపోకలులేనిస్థితిని, ఆనందస్థితిని గురువు అనుగ్రహం లేకుండా జీవుడు పొందే అవకాశం లేదు. ఏదో ఖర్మఅనుభవిస్తున్నాము అని కొంతమంది అంటారు. కాని గురువు యొక్క శరీరం ఖర్మఅనుభవించటానికి రాలేదు. ఆనందంలో నానినాని, ఉబికిఉబికి ఒకరూపంగా శిష్యుడిని ఉద్దరించటానికి ఆనందతాడవంలో శరీరం ధరించాడు కాబట్టి వాడి శరీరంకూడా ఆనందమే. అందుచేత ఆయనను చూసేటప్పటికి మనకు కూడా ఆనందం కలుగుతుంది. నా మాటలు నమ్మకపోతే Look at him, you feel it. గురువుయొక్క శరీరం ఆనందంలో వచ్చింది, మరల ఆనందంలోనే ఆశరీరం అదృశ్యమవుతుంది. మనకు దుఃఖం పంచిపెట్టటానికి గురువు రాలేదు, ఆనందం పంచిపెట్టటానికి వచ్చాడు. ఆనందాన్ని, శాంతిని, జ్ఞానాన్ని మనతో షేర్ చేసుకోవటానికి గురువు వచ్చాడు. అందుచేత ఆయన శరీరంకూడా ఆనందమే, ఆయన శరీరం కూడా శాంతే, ఆయన శరీరంకూడా చైతన్యమే. అందుకే ఎప్పడయినా ఒకవస్తువు ఇతరులకు ఇచ్చేటప్పడు మనం ఏడుస్తూ ఇవ్వకూడదు. అలా ఏడుస్తూ ఇచ్చే బదులు అసలు ఇవ్వటం మానేస్తే మంచిది. మనం ఏడుస్తూ ఇస్తే ఆఏడుపు వాడికి కూడా అంటుకొంటుంది, మన ఏడుపులో వాడు వాటాపంచుకొంటాడు కాని వాడికి ఆవస్తువు ఉపయోగపడదు. అందుచేత మనం ఏపనిచేసినా ఆనందంతో చేయాలి. చివరకు ఎవడికయినా ఒక బీరకాయ ఇస్తే అదికూడా ఆనందంగా ఇవ్వాలి, ఆనందంగా ఇస్తే దాని వలన వాడికి ఆనందం కలుగుతుంది, మనం ఆనందంగా ఇవ్వకపోతే అది తిన్నా వాడికి జీర్ణమవ్వదు. ఖర్మజీవుడు అనుభవిస్తాడు కాని ఆత్మకు దానితో సంబంధంలేదు. ఖర్మ అనుభవిస్తున్నారా, ఈమధ్య బొత్తిగా సుఖంగాలేదా, ఇవన్నీ జీవలక్షణాలు. ఈ జీవలక్షణాలను పోగొట్టటానికి చైతన్యమే రూపంధరించివచ్చింది, వాడే గురువు. ఒకవేళ నీకు యోగ్యతలేదు అనుకో, అర్హతలేదు అనుకో నీవు బయటకు వెళ్లిపో అని చెప్పడు. మీకు యోగ్యతలేకపోతే యోగ్యతను పట్టిఇస్తాడు, అర్హతలేకపోతే అర్హతను పట్టియిస్తాడు, నీ హృదయాన్ని విశాలంచేస్తాడు, ఆపని అంతా ఆయనే పూర్తిచేసి నీతోఏదో మాట్లాడుతూ, ఏవోకబుర్లు చెపుతూ నీకు తెలియకుండానే నిన్ను ఆయనలో ఐక్యం చేసుకొంటాడు, వాడు గురువు.

**రమణ భాస్కర**

కొంతమంది బాగాపక్వం వచ్చిన జీవులకు శరీరంధరించనక్కరలేకుండానే లోపల జ్యోతి రూపంలో దర్శనమిచ్చి, లోపలనుండే గైడెన్స్ ఇచ్చి, లోపలకు గుంజుకొని ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. అలాకూడా కొంతమందికి గురువు చేస్తూఉంటాడు. నీకు రూపబుద్ధి లేనప్పుడు రూపంతో పనిలేకుండా లోపలనుండే సర్జరీ చేసి నీకు శాంతిని, జ్ఞానాన్ని అనుగ్రహిస్తాడు, ఇదంతాలోపల నుండే చేసుకొని పోతూఉంటాడు.

గురువు ఎలా ఉంటాడు అని అడుగుతున్నారు. గురువు ఓర్పుగా ఉంటాడు, శాంతిగా ఉంటాడు. గురువుయొక్కఓర్పుకు హద్దులు ఉండవు. సూదంటురాయి ఇనుమును ఆకర్షించినట్లు తనమాటతో, తనచూపుతో భక్తుడిని ఆకర్షించుకొంటాడు, ఆకర్షించుకోవటమే కాదు తనస్వరూపాన్ని ఇస్తాడు. గురువు ఎంతటివాడో ఇప్పుడు నీకు తెలియదు. నువ్వు ఎవడో నీకు తెలిసాక, నీ స్వరూపం నీకు తెలిసాక గురువు యొక్క వైభవం గురించి, గురువు యొక్క విశిష్టత గురించి నీకు తెలుస్తుంది. అప్పటివరకు గురువు అంతటివాడు, గురువు ఇంతటివాడు అనినోటితో చెప్పినా, నీ మనస్సుతో ఊహించినా గురువు యొక్క ఔన్నత్యాన్ని నీవు గుర్తించలేవు. నీస్వరూపం నీకు తెలిసాక గురువు యొక్క ఔన్నత్యం నీకు తెలుస్తుంది, అంతవరకు ఏదో తెలిసినట్లుగా అనిపించినా నీకు తెలియదు. అన్ని జీవరాశులలో నీగురువునే చూడటం నేర్చుకొనే పరిస్థితిని కల్పిస్తాడు. అప్పడు నీకు ఎటుచూసినా గురువే కనిపిస్తాడు, అలానిన్ను అనుగ్రహిస్తాడు. నీకు ఎక్కడయితే విశ్వాసంకుదురుతోందో, ఎవరినిచూస్తే నీకు భక్తి కలుగుతోందో, ఎవరిని చూస్తూఉంటే నీలోపల ఉన్న ఆనందం నీకు ఎఱుకలోనికి వస్తోందో వాడిని గురువుగా తీసుకో. అక్కడ పాండిత్యం, ధనం, బాహ్య ప్రక్రియలు ఏమీ ప్రధానంకాదు. వేసవికాలంలో చల్లటిగాలి వీస్తూఉంటే ఎలా ఉంటుందో అలాగ ఎవరి సమక్షంలో ఉన్నప్పడు నీకు కూల్‌గా ఉంటుందో వాడిని నీగురువుగా తీసుకో. జ్ఞానం అనేది పైనుండి పోసేదికాదు లోపలనుండి ఊరాలి. ఈ లోకంలో ఎంతోమంది మహర్షులు, మహనీయులు, జ్ఞానులు ఉన్నారు. నీ మనస్సు ఎవరితో శృతికలుపుతోందో, ఎవరిమీద నీకు విశ్వాసం కుదురుతోందో వారినే నీ గురువుగా తీసుకోవచ్చు. కాని మోక్షం పొందాలి అనే తపన, ఆముముక్షత్వం, మహాపురుషులతో సహవాసం చెయ్యాలనే తపన ఇదంతా లోపలనుండి వస్తుంది గాని బయటనుండి వచ్చేది కాదు. ఒకోసారి గురువు నీకోసం రూపం ధరించడు. నీ జిజ్ఞాసనిజమైతే, తగిన అర్హత నీకు వస్తే నీలోపలనుండే గైడెన్స్ ఇచ్చి, జీవలక్షణాలను తొలగించి, చైతన్యస్రవంతిలో నిన్ను కలిపేస్తాడు. నీ నామబుద్ధినుండి, రూపబుద్ధినుండి





నిన్ను విడుదలచేసి నిన్ను మోక్షసామ్రాజ్యానికి అధిపతిని చేస్తాడు. గురువు యొక్క అనుగ్రహం లోపలనుండి పనిచేస్తూ ఉంటుంది. గురువు అంటే ఆత్మ, గురువు అంటే శాంతి, గురువు అంటే చైతన్యం, గురువు అంటే ఆనందం అది గుర్తించటానికి నీకు తగినయోగ్యత ఉండాలి. భగవంతుడే ఎదురుగా ఉన్నా కృష్ణ పరమాత్మని కౌరవులు గుర్తించలేదు. గురువు ఎదురుగా ఉన్నప్పటికి, ఆయన వైభవం గురించి చెపుతున్నప్పటికి మనకు లోపల యోగ్యత లేకపోతే కళ్ళుఉండి చూడలేరు, చెవులు ఉండి వినలేరు, బుద్ధిలో పక్వత లేకపోతే అర్థంచేసుకోలేరు. గురువుయొక్క వైభవము నీ అవగాహనకు అతీతంగా ఉన్నప్పడు, నీవు అర్థం చేసుకొనే అవకాశం లేదు. గురువు యొక్క వైభవాన్ని గ్రహించలేకపోతున్నాను, దైవముయొక్క శక్తిని గుర్తించలేకపోతున్నాను అనే తపన కలిగినప్పడు ఆ గ్రహించేశక్తిని ఆయనే అనుగ్రహిస్తాడు, వాడు గురువు. నీలో బలహీనతలు ఉన్నంతకాలం గురువుయొక్క సహాయం నీకు అవసరమే ఎందుచేతనంటే గురువు యొక్క సహాయంలేకుండా ఆబలహీనతలనుండి నీవు విడుదల పొందలేవు. నాహృదయంలో ఏదో సత్యంఉంది అని చెపుతున్నారు, అదినాకు తెలియటంలేదు. అది తెలుసుకోవటానికి మీరు అనుగ్రహిస్తారా అని భగవాన్‌ను అడిగితే ఆయన ఏమిచెపుతున్నారు అంటే అనుగ్రహించమని, సహాయం చెయ్యమని గురువును అడగవలసిన పనిలేదు. మీరు మమ్మల్ని ప్రేమించండి అని అడిగిఎంతకాలం ప్రేమించుకొంటారు. మా సహాయం మీరు అడగనక్కరలేదు. అడుగకిచ్చెడు నీదు అకళంకమగు కీర్తి హానిసేయక బ్రోవు మరుణాచలా అన్నారు అక్షరమణమాలలో భగవాన్. అడగకుండా ఇచ్చే అలవాటు నీకు ఉంది, ఇప్పడు నాచేత అడిగించుకొని కూడా ఇవ్వవు అనుకో నీకీర్తికి భంగం అన్నారు భగవాన్. ఏవోకోరికలు నెరవేరటంకోసం మనం భగవంతుడిని ప్రార్థిస్తూఉంటాము, అదికూడా భక్తే. కాని భక్తులలో సత్యాన్వేషకులు కొంతమందే ఉంటారు. నీవు సత్యసాక్షాత్కారం పొందాలి అనుకొన్నంతకాలం నీకు గురువు యొక్క అవసరం ఉంది. నీహృదయంలోఉన్న ఆత్మే, నీహృదయంలో ఉన్న చావులేని పదార్థమే గురువు. నీవు ద్వైతబుద్ధిపెట్టుకోవద్దు. ద్వైతబుద్ధి ఉన్నంతకాలం పునర్జన్మ వస్తుంది. మొదటలో గురువువేరు, నేను వేరు అని నీవు అనుకోవచ్చు. నీవు ఎలా అనుకొంటున్నావో గురువు చూస్తూఉంటాడు. ఆ బేధబుద్ధిలో నుండి నిన్ను విడుదలచేసి అభయస్థితిని కలుగజేసి నిన్ను అనుగ్రహించి నీకు మోక్షాన్ని ఇస్తాడు, వాడు గురువు. జ్ఞానం అంటే ఇన్‌ఫర్‌మేషన్ జ్ఞానంకాదు, యింద్రియాలతో మనం గ్రహించేది జ్ఞానంకాదు. మనహృదయంలో ఒక సత్యం ఉంది. ఉన్నది ఉన్నట్లుగా దానిని మనం గ్రహిస్తే అది జ్ఞానం,

అప్పడు మృత్యువులోనుండి విడుదలపొందుతావు. ఇవన్నీ వింటూ మీదయ నామీద ఉంటుందా అని వాడు అడుగుతున్నాడు. భగవాన్ ఎంతవండర్‌ఫుల్‌గా చెపుతున్నారో చూడండి. దయ ఉంటుంది అని చెప్పలేదు, దయ ఎప్పడూ ఉంటూనే ఉంటుంది. దయ నువ్వు అడిగినా ఉంటుంది, అడుగకపోయినా ఉంటుంది, నీకు అర్హత వస్తూఉంటే దయ యొక్క స్వరూపం నీకు తెలుస్తూఉంటుంది, అగ్నివేడి లేకుండా ఉండదు అలాగే గురువు దయలేకుండా ఉండడు. గురువు యొక్క దయ ఎప్పడూ ఉండనే ఉంటుంది. ఆ దయను గ్రహించేబుద్ధి నీకు కలగాలి. ఆగ్రహించే బుద్ధి నీకు ఉందో, లేదో అదిచూసుకో అంతేగాని గురువు దయ ఉందా, లేదా అని కాదు. గురువుయొక్క దయ నాకు ఎలా తెలుస్తుంది అని అడిగితే గురువు మీద భక్తివలన, విశ్వాసం వలన అది నీకు తెలుస్తుంది. నువ్వు విశ్వాస హీనుడవు అవ్వవద్దు. గురువుకు శరణాగతి చెందు అప్పడు ఆయనదయ నీకు తెలుస్తుంది. భగవాన్ ఏదిచెప్పినా నిశ్చయంగా చెపుతారు, సందేహరహితంగా చెపుతారు, అనుకోవటాలు అక్కడకుదరవు. గురువు యొక్క అనుగ్రహం ఎప్పడూ ఉంది, నీకుశక్తి ఉంటే అనుగ్రహాన్ని గుర్తించగలవు లేకపోతే తెలియదు. నీకు తెలిసినా, తెలియకపోయినా అనుగ్రహంఉంది. నీకు తెలియనంత మాత్రంచేత అనుగ్రహం లేదుఅని అనుకోవద్దు. ఈమధ్యశాంతిలేదు, అంతా ఆందోళనగా ఉంది మన గురువు మనలను మర్చిపోయాడా, మన గురువు మనలను వదిలేసాడా అని మనకు అనిపిస్తుంది. ఆ జిమ్మిక్కులు చేసేవాడు, అలా అనిపింపచేసేవాడు ఆయనే. ఆయన హృదయంలోనికి మనలను తీసుకోవటానికే ఈ జిమ్మిక్కులు చేస్తూఉంటాడు. బ్రహ్మం తప్పించి ఇంక ఏదీ లేదని నీకు తెలిసేవరకూ, బ్రహ్మానుభవం నీకు కలిగేవరకు గురువు నిన్ను వెంటాడుతూ ఉంటాడు. నీలోపల ఉన్న బ్రహ్మం నీకు అనుభవంలోనికి వచ్చాక ఎక్కడో ఉన్నాడు అనుకొన్నాను ఇక్కడే ఉన్నాడు అని నీకు తెలుస్తుంది. ఇదంతా గురువు దయవలననే జరిగిపోతూ ఉంటుంది. ఆయనవేరు, నేను వేరు అని ద్వయీభావనతో నువ్వు పూజించటం ప్రారంభిస్తావు. కాని హృదయంలో ఉన్న సత్యంగురించి ఆయన నీకు బోధిస్తాడు, దానిని స్మరించేటట్లు చేస్తాడు, దాని గురించి తపించేటట్లు చేస్తాడు. హృదయంలో ఉన్న సత్యం గురించి తపింపచేసి, స్మరింపచేసి విడిచిపెట్టడు, అది పొందేవరకూ ఆయన దయ నిన్ను వెంటాడుతుంది వాడు గురువు. గురువును ఆశ్రయించు, గురువును విడవకుండా పట్టుకో, ఆయన చెప్పినది శ్రవణం చెయ్యి, వారికి సేవ చెయ్యి, గురువుకు సేవ చేసేకొలది, ఆయనమాటలు శ్రవణం చేసేకొలది నీకేమి తెలుస్తుంది అంటే ఏకారణం వలన ఈజన్మలోనికి వచ్చాము, ఏకారణం వలన మనకు ఈ దుఃఖం కలుగుతోంది ఆకారణాలు తెలుస్తాయి. ఆకారణాలు నీకు తెలిసాక వాటిని ఆయనే కత్తిరించితొలగిస్తాడు. అప్పడు నీకు దుఃఖం తోటి, జన్మతోటి ఉన్నసంబంధం ఊడిపోతుంది, అలా ఊడిపోయేలాగ అనుగ్రహించేవాడే గురువు. భగవంతునిపట్ల నీవు ఏదైనా అపచారం చేస్తే ఆ అపచారం యొక్క ప్రభావం నీ మీద పడకుండా గురువు నిన్ను సరిదిద్దుతాడు అంటే ఒకవేళ భగవంతుడు మీకు పదిసంవత్సరాలు శిక్షవేసాడు అనుకోండి, దానిని ఏదోపది రోజులలో మీచేత అనుభవింపచేసి అందులో నుండి బయటకు తీసుకొనివస్తాడు వాడు గురువు. ఒకవేళ గురువు పట్ల మీరు అపచారం చేస్తే భగవంతుడు సరిదిద్దలేడని కొంతమంది మహాత్ములు చెపుతున్నారు అని భగవాన్ అంటున్నారు, గురువు యొక్క వైభవం తెలియటం కోసం ఈ మాటలు చెపుతున్నారు. అందరి శిరస్సు మీద ఆయన దయ ఉంది, తెలిసినా ఉంది, తెలియకపోయినా ఉంది, ఉందని తెలిసినవారు అదృష్టవంతులు. మనకు పుణ్యబలం ఉంటే ఆయన దయ మన మీదఉన్నట్లు మనకు తెలుస్తుంది. అనేకజన్మలు సాధన చేస్తేగాని, అనేక జన్మలలో మంచికర్మలు చేసుకొంటూ వస్తేగాని మనమొఖం భగవంతునివైపు తిరగదు అని పరమాత్మ చెప్పాడు. అద్వైతానుభవం, అద్వైతసుఖం అనుభవంలోనికి వచ్చేవరకు మిమ్మల్ని బేధబుద్ధి విడిచిపెట్టదు, దుఃఖం విడిచిపెట్టదు, జన్మలు వెంటాడుతూ ఉంటాయి. మీకు ఎప్పడయినా అశాంతి కలుగుతూ ఉంటుంది, ఏమిటి ఇంత అశాంతిలో నేను ఉన్నప్పడు గురువు నా చెయ్యి విడిచిపెట్టేసి ఎక్కడికో పోయాడు అని నీకు అనిపిస్తుంది. నీలోఎంత అశాంతి ఉందో, అది ఎంతబలంగాఉందో, ఎంత దట్టంగా ఉందో నీకు తెలియజేసి తరువాత దానిని తొలగించటానికి ప్రయత్నంచేస్తాడు. అశాంతిలోనుండి, దు:ఖబంధంలో నుండి నిన్ను విడుదలచేయటానికి ఆ ప్రక్రియలు అన్నీ చూపిస్తూ, అందులోనుండి విడుదలయ్యే శక్తిని, భక్తిని నీకు ప్రసాదించి అందులోనుండి నిన్ను విడుదల చేస్తాడు, వాడు గురువు. ఆ భక్తిభావనను ఇచ్చేవాడు గురువే, అజ్ఞానాన్ని తొలగించుకోవాలి అనేబుద్ధిని ఇచ్చేవాడు గురువే, అజ్ఞానంలోనుండి విడుదలచేసేవాడు గురువే, నీకు బ్రహ్మనిష్టకలుగజేసేవాడు గురువే, అన్నీ గురువే. ప్లెజర్, పెయిన్ అనేవి కేవలం దేహానికి సంబంధించినవి. దేహబుద్ధి ఉన్నప్పడు సంతోషం వెంటాడుతుంది, దుఃఖం వెంటాడుతుంది. దేహాభిమానం లేనివాడికి ప్లెజర్‌లేదు, పెయిన్‌లేదు. ఈదేహభిమానంలోనుండి విడుదల అవ్వాలనే ఆసక్తి కలుగజేసేవాడు, దేహాభిమానంలో నుండి మిమ్మల్ని విడుదలచేసేవాడు గురువే, ఇది తెలిసినవారు ధన్యులు, అదృష్టవంతులు.

**20-09-2003**

**రమణ భాస్కర**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 23-09-03 | మంగళ | జిన్నూరు, సద్గురు శ్రీ నాన్నగారి 70వ జన్మదిన మహోత్సవము, శ్రీ రమణ క్షేత్రం |
| 25 టు 28-9-03 | | హైదరాబాదు క్యాంపు |
| 28-09-03 | ఆది | హైదరాబాదు నల్లకుంట రమణ కేంద్రంలో |
| 30-09-03 | మంగళ | గుమ్మలూరు |
| 03-10-03 | శుక్ర | శృంగవృక్షం కనకదుర్గ అమ్మవారి గుడివద్ద |
| 05-10-03 | ఆది | పోడూరు మ॥ గం॥ 4-00 లకు రుద్రరాజు విజయరామరాజు - కృష్ణవేణి గారి ఇంటి వద్ద |
| 06 టు 12-10-03 | | అరుణాచలం క్యాంపు |

## సద్గురు శ్రీ నాన్నగారి 70వ జన్మదిన మహోత్సవం

| | |
|---|---|
| ఉ॥ గం॥ 6-00ల నుండి | సద్గురు దర్శనం |
| ఉ॥ గం॥ 8-00లకు | భగవాన్ పూజ - శ్రీ రమణ క్షేత్రంలో |
| ఉ॥ గం॥ 10-00 ల నుండి గం॥ 12-00ల వరకు | దూరప్రాంత భక్తులకు భోజనాలు |
| మ॥ గం॥ 12-00లకు | శ్రీ నాన్నగారు ఆశ్రమమునకు రాక |
| మ॥ గం॥ 2-00లకు | సద్గురువుకు కమిటీవారిచే సన్మానం |
| మ॥ గం॥ 2-15 ని॥లకు | సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు |



**బుద్ధగయలో సద్గురు శ్రీ నాన్నగారు**

## రమణ క్షేత్రం ప్రచురణలు

| | |
|---|---|
| 1. రమణ భాస్కర బైండులు 98-99 | 50 |
| 2. రమణ భాస్కర బైండులు 99-2000 | 100 |
| 3. రమణ భాస్కర బైండులు 2000-01 | 100 |
| 4. రమణ భాస్కర బైండులు 01-02 | 125 |
| 5. రమణ భాస్కర బైండులు 02-03 | 125 |
| 6. వినీలాకాశంలో వింతకాంతి | 25 |
| 7. అమృత వాక్కులు | 20 |
| 8. The Art of the Holy Hill | 20 |
| 9. శ్రీ రమణ కేంద్రం | 10 |
| 10. ప్రస్థానత్రయం | 12 |
| 11. దైవ సంపద | 12 |
| 12. జ్ఞాన కిరణాలు | 6 |
| 13. సద్గురు శ్రీ నాన్నగారు | 5 |
| 14. రమణ ప్రసాదం | 5 |
| 15. అక్షరమణమాల | 4 |
| 16. వాశిష్ఠ రమణీయం | 5 |
| 17. సత్యాన్వేషణ - సత్యదర్శనం | 10 |
| 18. శ్రీ నాన్న ప్రవచనాలు | 20 |
| 19. శ్రీ రమణ మహిమలు | 5 |
| 20. అష్టోత్తరములు | 5 |
| 21. ధ్యానం | 30 |
| 22. రమణ ఉవాచ | 2 |
| 23. అరుణాచల అష్టకం | 1 |
| 24. అక్షరమణమాల + ఉపదేశసారం (ఉషా) | 10 |
| 25. మధురవాక్యములు | 10 |
| 26. శ్రీనాన్న ఉవాచ | 12 |

## రమణ క్షేత్రంలో లభించు రమణాశ్రమ ప్రచురణలు

| | |
|---|---|
| 1. శ్రీ రమణ భాషణములు | 80 |
| 2. శ్రీ రమణ లేఖలు | 80 |
| 3. నీ సహజ స్థితిలో ఉండు | 50 |
| 4. శ్రీ మహర్షి | 20 |
| 5. నేనెవడను | 2 |
| 6. రమణ స్మరణామృతం | 20 |
| 7. శ్రీ రమణ మహర్షి ఉపదేశం | 20 |
| 8. శ్రీ రమణ అనుగ్రహ తరంగాలు | 80 |
| 9. అరుణాచల మహత్యం | 40 |
| 10. శ్రీ రమణ కథాసుధ | 10 |
| 11. శ్రీ రమణ కథామణిమాల | 15 |
| 12. రమణ ఉపదేశామృతం | 20 |
| 13. The Teaching of Sri Ramana | 200 |
| 14. రమణ తాత | 3 |
| 15. అనుగ్రహ తరంగాలు | 55 |
| 16. భగవాన్ స్మృతులు | 45 |
| 17. వాశిష్ఠ రమణీయం | 2 |
| 18. శ్రీ రమణ సుప్రభాతం | 10 |
| 19. శ్రీ రమణ ప్రపత్తి | 1 |
| 20. శ్రీ మురుగనార్ | 15 |
| 21. శ్రీ రమణ గీత | 10 |
| 22. సూక్తి మాలిక | 8 |
| 23. శ్రీ రమణ మహర్షి హృదయం | 2 |
| 24. Gracious Movement in the Presence of Sri Ramana | 60 |
| 25. భగవాన్ రమణ మహర్షి ఉపదేశసారం | 3 |
| 26. శ్రీ రమణ స్తుతి పంచకం | 3 |